సాక్షి
నంద్యాల

సోమవారం । 19 । ఆగస్టు । 2024



మహానందిలో పెళ్లి సందడి

నంద్యాల(అర్బన్): మహానంది క్షేత్రంలో ఆదివారం 15 పెళ్లిళ్లు జరిగాయి. ఓ వైపు పెళ్లిలకు హాజరైన బంధువులు, మరో వైపు భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది.



.. ఒక గూటి దివ్వెలు

అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తోంది. సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 74
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 28,041
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:10,695

న్యూస్‌రీల్

శ్రీచౌడేశ్వరిదేవికి వెండి కిరీటం విరాళం




ఉత్సవమూర్తికి వెండి కిరీటం, నాగపడిగను అలంకరించిన దృశ్యం

బనగానపల్లెరూరల్: నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారికి అనంతపురం జిల్లా నార్పల మండలం మద్దెలపల్లె గ్రామానికి చెందిన గురుదత్త అంబటి గోవిందు కుటుంబ సభ్యులు ఆదివారం వెండి కిరీటం, నాగపడిగను విరాళంగా అందజేశారు. వీటి విలువ రూ.1,16,904 అని దాత పేర్కొన్నారు. అనంతరం దాతను ఆలయ అసిస్టెంటెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల(అర్బన్): స్థానిక కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

గాలేరు నగరికి 14 వేల క్యూసెక్కులు



జీఎన్ఎస్ఎస్ గేట్ల వద్ద కృష్ణా జలాలు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి ఆదివారం గాలేరు నగరి సుజల స్రవంతి కాల్వకు 14 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఏ దేవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి 30 వేల క్యూసెక్కుల నీరు ఎస్ఆర్ఎంసీ కాలువ ద్వారా వచ్చి చేరుతుందన్నారు. కాగా అక్కడి నుంచి జీఎన్ఎస్ఎస్‌తో పాటు తెలుగు గుంగ (వీబీఆర్)కు 10 వేల క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 6 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వీబీఆర్‌లో 14 టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉందన్నారు. పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులర్ నుంచి విడుదలవుతున్న నీటినంతా దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

మహానంది వ్యవసాయ కళాశాలకు 31 ఏళ్లు



నంద్యాల(అర్బన్): ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మహానంది వ్యవసాయ కళాశాల ఏర్పడి ఆదివారం నాటికి 31 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లు కళాశాల డీన్ జయలక్ష్మి తెలిపారు. స్థానిక కళాశాల ఆవరణలో ఆమె మాట్లాడుతూ 1993లో అప్పటి దేశ ప్రధాని పీవీ నరసింహారావు వ్యవసాయ కళాశాలను ప్రారంభించారన్నారు. ఈ కళాశాలలో విద్యనభ్యసించిన వారిలో చాలా మంది అనంతరం ఉన్నత చదువులు చదివి శాస్త్రవేత్తలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఐఆర్ఎస్‌లు అయ్యారన్నారు. వివిధ రాష్ట్రాలు, పలు దేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నత పదవుల్లో ఉండటానికి వ్యవసాయ కళాశాల కృషి ఎంతో ఉందన్నారు. దేశంలోని వ్యవసాయ కళాశాలలకు మహానంది కాలేజీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

నేడు గుజరాత్‌కు జెడ్పీ చైర్మన్

కర్నూలు(అర్బన్): గుజరాత్ రాష్ట్రంలోని ఆనంద్ నగరంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న రెసిడెన్షియల్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మంగళవారం వెళ్తున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఇక్కడ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హాజరు కావాలని జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డికి కేంద్ర ప్రభుత్వం నుంచి సమాచారం అందిందని తెలిపారు.

మినరల్ గరళం!



"మీరు మినరల్ వాటర్ తాగుతున్నారా? మినరల్ వాటర్ లేకపోతే నీళ్లు తాగలేకపోతున్నారా? అయితే మీరు అనారోగ్యానికి దగ్గర పడుతున్నారన్నమాట. "ఇదేంటి! ఆరోగ్యం కోసం 'స్వచ్ఛమైన మినరల్ వాటర్' తాగుతుంటే.. అనారోగ్యానికి గురవుతారని చెబుతున్నారు' అనుకుంటున్నారా? అవునండి! నిజం, ఎందుకంటే మనం తాగే మినరల్ వాటర్‌లో మినరల్స్ ఉండవు. మినరల్ వాటర్ కంటే బోరు నీళ్లే సురక్షితం. ఎలా అంటారా?" అయితే ఈ వార్త చదవండి...

– సాక్షి ప్రతినిధి కర్నూలు

- జనరల్ వాటర్ కంటే మినరల్ వాటర్ తాగేందుకే అధికశాతం ఆసక్తి
- గుర్తింపులేని మినరల్ వాటర్ తాగితే రోగాల బారిన పడటం ఖాయం
- టీడీఎస్ స్థాయిని గణనీయంగా తగ్గిస్తున్న ప్లాంట్ల నిర్వాహకులు
- ల్యాబ్ పరీక్షల్లో మినరల్ వాటర్‌తో ప్రమాదమని తేలుతోన్న వైనం
- ముప్పని తెలిసినా చోద్యం చూస్తున్న పబ్లిక్‌హెల్త్ అధికారులు
- దృష్టి పెడితే ఇంట్లో మనమే 'ఆల్కలైన్ వాటర్' తయారు చేసుకునే అవకాశం


మనిషి మనుగడకు ప్రధానమైంది స్వచ్ఛగాలి, స్వచ్ఛనీరు. ప్రస్తుతం ఈ రెండు కలుషితమయ్యాయి. పట్టణీకరణ పెరగడంతో గాలి కలుషితమైంది. ఎక్కువ మంది కలుషిత గాలినే పీలుస్తున్నారు. అలాగే నీరు కూడా కలుషితమై కలవరపెడుతోంది. దీంతో 90శాతం మంది 'మినరల్‌వాటర్' పేరుతో ఫిల్టర్ నీటిని సేవిస్తున్నారు. ఈ నీటిని సేవిస్తున్న లక్షలాదిమందికి గుర్తింపు లేని మినరల్ వాటర్ ఫిల్టర్ ప్లాంట్లు మరో ముప్పును తెచ్చి పెడుతున్నాయి. శుద్ధి చేసిన క్యాన్, బాటిల్, ప్యాకెట్ ద్వారా విక్రయిస్తున్న నీటిని తాగితే రోగాలు తథ్యమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందులో కరిగిన ఘన పదార్థాల శాతాన్ని (టీడీఎస్- టోటల్ డిసాల్వ్‌డ్ సాలిడ్స్) అతి స్వల్ప మోతాదుకు తగ్గించడమే అందుకు ప్రధాన కారణం. దీర్ఘకాలం ఈ నీటిని తాగితే మూత్రపిండాలు, హృదయ సంబంధిత వ్యాధులు, రక్తపోటుతో పాటు పలు రకాల వ్యాధుల బారిన పడటం తప్పదని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పట్టణం, పల్లె అనే తేడా లేకుండా జనావసరం ఉన్న ప్రతీ ప్రాంతంలో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఇందులో పట్టుమని పది మినహా తక్కిన ప్లాంట్లన్నీ భారతీయ ప్రమాణాల సంస్థ(బీఐఎస్) గుర్తింపు లేకుండా వెలిసినవే! బీఐఎస్ సూచించిన 60 రకాల నాణ్యతా ప్రమాణాలు యథేచ్ఛగా ఉల్లంఘనకు గురవుతున్నా పబ్లిక్ హెల్త్ అధికారులు గానీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ సంస్థలు కానీ మొద్దు నిద్ర వీడడం లేదు.

స్వచ్ఛమైన నీరు అంటే..

హైడ్రోజన్, ఆక్సిజన్ మాత్రమే కలిగి ఉన్న నీటిని స్వచ్ఛమైన నీరుగా వ్యవహరిస్తారు. దీన్ని శుద్ధజలం (డిస్టిల్డ్ వాటర్)గా పిలుస్తారు. ఈ నీటిని కర్మాగారాలకు వాడతారు. తాగేనీటిలో శరీరానికి అవసరమైన ఘన పదార్థాలు సరైన మోతాదులో ఉండటం తప్పనిసరి. కాల్షియం, మెగ్నీషియం, ఐరన్ వంటి ఉపయోగకర ఘనపదార్థాలు మనకు నీటి ద్వారానే అందుతాయి. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ నేపథ్యంలో భూగర్భజలాలు కలుషితమై సీసం, పాదరసం , ఫ్లోరిన్ లాంటి హానికర మూలకాలు తాగే నీటిలో మిళితం అయ్యాయి. వీటిని తొలగించి శరీరానికి అవసరమైన మూలకాలను సరైన మోతాదులో ఉండేలా భూగర్భజలాలను శుద్ధి చేయాలి. కానీ చాలామంది ఈ ప్రక్రియను పక్కాగా నిర్వహించడం లేదు. హానికారకాలను తొలగించే ప్రక్రియలో భాగంగా చాలా 'ఫిల్టర్లు' టీడీఎస్‌లను నామమాత్రపు స్థాయికి తగ్గిస్తున్నాయి. దీంతో శరీరానికి అవసరమైన మూలకాల మోతాదు గణనీయంగా తగ్గుతోంది. దీంతో ఇప్పటికిప్పుడు ప్రమాదం లేకపోయినా, దీర్ఘకాలంలో శరీరంలో ఘనపదార్థాల సమతుల్యత దెబ్బతిని అనారోగ్యానికి గురికాక తప్పదు. తాగేనీటిలో టీడీఎస్ మోతాదు కనీసం 80–150 మధ్య ఉండటం మంచిదని డబ్ల్యూహెచ్ఓ(ప్రపంచ ఆరోగ్యసంస్థ) సహా పలు సంస్థలు చెబుతున్నాయి.

ఇలా చేస్తే ఇంట్లోనే స్వచ్ఛ శుద్ధ జలం

మదనపల్లి వాసి ప్రసాద్ ప్రకృతివనం పేరుతో స్వచ్ఛజలాన్ని గత 12 ఏళ్లుగా వాడుతున్నారు. వర్షం నీటిని నిల్వ చేసుకుని దానిని శుభ్రం చేసుకుని సేవిస్తున్నారు. మనకు వర్షం నీరు లభించడం కష్టం. అయితే కర్రబొగ్గులు, సున్నపురాళ్లు, ఇటుకపెళ్లలు, ఇసుకను పొరలుగా ఓ పాత్రలో ఉంచి, ఆ పాత్రకు ఓ కుళాయిని అమర్చుకోవాలి. బోరు నీళ్లు, లేదా మనం కొనుగోలు చేసిన మినరల్ వాటర్‌ను ఈ పాత్రలోకి పోస్తే పొరల ద్వారా ప్రవహించి అది ఆల్కలిన్ వాటర్ అవుతుంది. దీన్ని సేవించవచ్చు. మరింత ఆరోగ్యంగా ఉండాలంటే ఈ నీళ్లను ఓ మట్టికడవలో పోసి రాత్రి ఉంచి అందులో రాగి ప్లేటును ఉంచి ఉదయం సేవిస్తే కావల్సిన మినరల్స్ శరీరానికి లభిస్తాయి.



టీడీఎస్ అంటే..

నీటిలో పూర్తిగా కరిగిన ఘన పదార్థాల శాతాన్ని టీడీఎస్‌గా వ్యవహరిస్తారు. లీటరు నీటిలో ఎన్ని మిల్లీగ్రాముల ఘన పదార్థాలు కరిగి ఉన్నాయో దీని ఆధారంగా లెక్కిస్తారు. ఉదాహరణకు ఓ ప్రాంతంలోని బోరు లేదా కుళాయి నీటిలో '500 టీడీఎస్' ఉందంటే ఈ నీటిలో లీటరుకు 500 మిల్లీగ్రాముల ఘనపదార్థాలు ఉన్నాయని అర్థం.

తెలుసుకోండిలా..

నీటిలో టీడీఎస్ తెలుసుకునేందుకు రూ.500కే టీడీఎస్ టెస్టర్ లభిస్తుంది. మార్కెట్‌లోని ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌నే మినరల్ వాటర్‌గా భావిస్తున్నారు. కానీ కిన్‌లే, ఆక్వాఫినా, కింగ్‌ఫిషర్, టాటా లాంటి కొన్ని ప్రత్యేకమైన కంపెనీలు నిపుణుల సమక్షంలో వాటర్‌ను శుభ్రం చేస్తున్నాయి. మనం తాగే నీటిలో టీడీఎస్ టెస్టర్ పెడితే టీడీఎస్ ఎంత ఉందో క్షణాల్లో తేలిపోతుంది. మనం ఎలాంటి నీళ్లు తాగుతున్నామో అర్థం అవుతుంది. ఆటోల ద్వారా రూ.10కి క్యాన్ విక్రయించే మినరల్ వాటర్ మరింత డేంజర్! ఈ నీరు గుర్తింపు లేని ప్లాంట్లలో తయారైందే!

అక్రమాలు ఇలా..

ప్రస్తుతం మినరల్‌వాటర్‌ప్లాంట్ల మధ్య తీవ్ర పోటీ ఉంది. దీంతో నిర్వాహకులు భూగర్భజలాలను ఎక్కువ మోతాదులో ఫిల్టర్ చేస్తున్నారు. దీంతో మినరల్స్ పూర్తిగా వెళ్లిపోతున్నాయి. కొన్ని ప్లాంట్లలో రుచి కోసం కొన్ని రసాయనాలను వినియోగిస్తున్నారు. బీఐఎస్ ప్రమాణాల మేరకు ప్రతి ప్లాంటులో అధునాతన ప్రయోగశాల ఉండాలి. శుద్ధి చేసిన నీటిలో టీడీఎస్‌తో పాటు ఇతర వివరాలను రోజూ పరీక్షించి నమోదు చేసేందుకు ఓ బయోకెమిస్ట్ ఉండాలి. ఇవి ఉంటేనే మినరల్ ప్లాంటు ఏర్పాటుకు పబ్లిక్‌హెల్త్ అధికారులు అనుమతి ఇవ్వాలి. ఇవేవి ఫిల్టర్ ప్లాంట్లలో కనిపించవు. ఈ ప్లాంట్ల ద్వారానే వాటర్ ప్యాకెట్, వాటర్‌బాటిల్, క్యాన్‌లలోని మినరల్ వాటర్ విక్రయిస్తున్నారు. ఈ నీరు శుద్ధమైందని భావిస్తే ముప్పును కొనితెచ్చుకున్నట్లే! ఇంత తంతు జరుగుతున్నా 'పబ్లిక్‌హెల్త్' అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

నమ్మకం కోల్పోయిన మునిసిపాలిటీ వాటర్!

మునిసిపాలిటీ సరఫరా చేస్తే తుంగభద్ర, కృష్ణాజలాల వాటర్ అత్యంత మంచినీరు. అయితే మునిసిపాలిటీలు వీటిని శుద్ధి చేసి ఇళ్లకు సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నాయి. శుద్ధి నుంచి, ఇంటికి చేరే వరకూ పైపులైన్లు, ఇతర కారణాలతో ఈ నీరు కలుషితం అవుతోంది. దీంతోనే ఈ నీటిని తాగేందుకు ప్రజలు సాహసించడం లేదు. కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే వీటిని ఉపయోగిస్తున్నారు. ఇంకొందరు ఈ నీటిని ట్యాంకుల్లో నింపుకుని, తిరిగి ఇళ్లలో ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేసుకుని శుభ్రం చేసుకుని సేవిస్తున్నారు.



యాళ్లూరు ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

వైద్యులకు రక్షణ కల్పించాలి



నంద్యాలలో కొవ్వొత్తులతో సీఐటీయూ నాయకుల నిరసన

కోల్‌కతలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ జిల్లాలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. గోస్పాడు మండలం యాళ్లూరు సీహెచ్‌సీ వైద్యులు శివాణి, ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం అమలు చేయాలని కోరారు. నంద్యాల పట్టణంలో ఆదివారం రాత్రి సీఐటీయూ నాయకులు గాంధీచౌక్‌లో కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. కోల్‌కతా సంఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

– నంద్యాల(న్యూటౌన్)/గోస్పాడు

టీడీపీ నేతనే హత్యకు సూత్రధారి

- వీడిన హోసూరు హత్య కేసు మిస్టరీ
- ఆధిపత్యం కోసమే సొంత పార్టీ నేతను హతమార్చిన వైనం
- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- మోటారు బైక్, ఐరన్ రాడ్, కత్తి స్వాధీనం





హత్య కేసులో నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసాచారి, హత్యకు వాడిన ఇనుప రాడ్డు, కత్తి

తుగ్గలి(పత్తికొండ): పత్తికొండ మండలం హోసూరుకు చెందిన టీడీపీ నేత, మాజీ సర్పంచ్ శారద భర్త వాకిటి శ్రీనివాసులు హత్య కేసులో ప్రధాన సూత్రధారి అదే పార్టీకి చెందిన నాయకుడే అని తేలింది. గ్రామంలో ఆధిపత్యం కోసమే సొంత పార్టీ నేతను హతమార్చినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసి, ఆదివారం సాయంత్రం పత్తికొండ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసాచారి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 14న హోసూరులో టీడీపీ నేత వాకిటి శ్రీనివాసులు దారుణ హత్యకు గురయ్యారు. శ్రీనివాసులు రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేక అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత గుడిసె నరసింహులు అంతమొందించాలనుకున్నారు. అతని అనుచరులైన బోయ రామాంజినేయులు, వులివేని హరికృష్ణతో కలిసి చర్చించి మరో టీడీపీ నాయకుడు వడ్డే నరసింహులుకు తమ అభిప్రాయాన్ని చెప్పారు. తనకు రూ.10లక్షల ఇస్తే తన అల్లుడు, వారి స్నేహితుడి (ఇద్దరు మైనర్లు)తో హత్య చేయిస్తానని వడ్డే నరసింహులు ఒప్పందం కుదుర్చుకుని రూ.50వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. ఈనెల 14వ తేదీ తెల్లవారు జామున 5గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లి సెల్‌ఫోన్ చూసుకుంటూ కూర్చున్న శ్రీనివాసులు కళ్లల్లో కారం పొడి చల్లి వెనుకవైపు నుంచి తలపై ఇనుపరాడ్‌తో కొట్టి పదునైన కత్తితో నరకడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేశామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి గుడిసె నరసింహులు, అతని అనుచరులు బోయ రామాంజినేయులు, వులినేని హరికృష్ణ, వడ్డే నరసింహులుతో పాటు మరో ఇద్దరు మైనర్లను పువ్వ కాయమాడ క్రాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి మోటార్ సైకిల్, హత్యకు ఉపయోగించిన రాడ్, కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నలుగురు నిందితులను పత్తికొండ కోర్టు, ఇద్దరు మైనర్లను కర్నూలు జువైనల్ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. విచారణలో ప్రతిభ కనబర్చిన సీఐ జయన్న, దేవనకొండ, పత్తికొండ ఎస్ఐలు ఎస్ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ హేమ్లానాయక్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

శ్రీశైల క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం



మల్లన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి మల్లన్న దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలను నిలుపుదల చేశారు. భక్తుల విజ్ఞప్తి మేరకు రోజుకు నాలుగు విడతలుగా మల్లన్న సంపర్శదర్శనానికి అవకాశం కల్పించారు.

శ్రీమఠం.. ఉత్సవ శోభితం

- ఆరాధన ఉత్సవాలకు అంకురార్పణ
- మంత్రాలయంలో ప్రారంభమైన రాఘవేంద్రుల సప్తరాత్రోత్సవాలు
- ధ్వజారోహణతో వేడుకలను ప్రారంభించిన పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



శ్రీమఠం కారిడార్‌లో అశ్వపూజ చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం: వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల సుస్వరాలు, హరిదాస కీర్తనలు, భక్తజన హర్షధ్వానాలతో వేదభూమి పులకించింది. సద్గురు రాఘవేంద్రుల 353వ ఆరాధన సప్తరాత్రోత్సవాల అంకురార్పణ ఆదివారం వైభవంగా సాగింది. శ్రీమఠం పీఠాధిపతి శ్రీసుబుధేంద్రతీర్థులు శ్రీమఠం స్వర్ణ బృందావన శిఖరాగ్రాన ధ్వజారోహణ గావించి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ముందుగా శ్రీమఠం ప్రాంగణం నుంచి పీఠాధిపతులు ఊరేగింపుగా ఆలయ ముఖద్వారం వద్దకు చేరుకున్నారు. గోపూజ, అశ్వపూజ నిర్వహించి ధ్వజారోహణ చేశారు. కార్యనిర్వాహణ కార్యాలయంలో లక్ష్మీపూజ, ఏఏఓ, మేనేజర్, జోనల్ మేనేజర్ తదితర కౌంటర్లలో పూజలు చేపట్టారు. అక్కడి నుంచి యోగీంద్ర మంటపం చేరుకుని రాఘవేంద్రుల మైనపు విగ్రహానికి పుష్పార్చన, మంగళ హారతులు పట్టి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఉత్సవ విశేషాలపై పీఠాధిపతి భక్తులకు ప్రవచించారు. అనంతరం ఊంజల మంటపం ముంగిట శాస్త్రోక్తంగా ధాన్య పూజ నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ప్రభోత్సవం శ్రీమఠం మాడవీధుల్లో అశేష భక్తజనం మధ్య సాగింది. దాససాహిత్య బృందం మహిళలు ఆలకించిన కీర్తనలు, కోలాటాలు భక్తులకు కనువిందు చేశాయి. ఉత్సవాల్లో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్–1 ఎస్కే శ్రీనివాసరావు, మేనేజర్–2 వెంకటేష్‌జోషి, మేనేజర్–3 శ్రీపతిఆచార్, పీఆర్వో ఐపీ నరసింహమూర్తి, ధార్మిక సహాయకాధికారి వ్యాసరాజాచార్, మఠం ఈఈ సురేష్ కోనాపూర్ పాల్గొన్నారు.

భక్తులకు సకల ఏర్పాట్లు

రాఘవేంద్రస్వామి భక్తుల కల్పతరువుగా వెలుగొందుతున్నారని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పేర్కొన్నారు. వేడుకల అంకురార్పణలో భాగంగా యోగీంద్ర మంటపంలో స్వామిజీ ప్రసంగిస్తూ.. రాఘవేంద్రుల మహిమతో దేశ విదేశాలకు మంత్రాలయక్షేత్ర ఆధ్యాత్మిక పరిమళాలు విస్తరించాయన్నారు. 353వ ఆరాధనోత్సవాల్లో పాల్గొనే భక్తులకు సకల ఏర్పాట్లు చేశామన్నారు. ఏడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీమఠాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.



పట్టువస్త్రాలతో ఊరేగింపుగా వస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు దంపతులు

టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ

శ్రీ రాఘవేంద్ర స్వామికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆదివారం రాఘవేంద్రుల 353వ ఆరాధనోత్సవాల సందర్భంగా దేవస్థానం ఈవో జె.శ్యామలరావు దంపతులు పట్టువస్త్రాలు అందజేశారు. మహా ముఖద్వారం నుంచి మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా శ్రీమఠం చేరుకున్నారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఎంతో పవిత్రంగా పట్టువస్త్రాలు స్వీకరించి రాఘవేంద్రుల బృందావనంతో పూజలు చేశారు. అనంతరం ఊంజల మంటపంలో స్వామిజీ టీటీడీ దేవస్థానం, శ్రీమఠానికి ఉన్న అనుబంధం గూర్చి భక్తులకు ప్రవచించారు. ఏడుకొండలపై రాఘవేంద్రుల మఠం నిర్మాణానికి టీటీడీ సహకారం ఎనలేదని కొనియాడారు. ఈ సందర్భంగా ఈవో శ్యామలరావు దంపతులను పీఠాధిపతి శేషవస్త్రం, రాఘవేంద్రుల జ్ఞాపిక, ఫల పూల మంత్రాక్షింతలతో ఆశీర్వదించారు.

క్లుప్తంగా

తమ్ముడి చేతిలో అన్న హతం



మృతి చెందిన పసుపుల మల్లికార్జున

వెలుగోడు: మద్యం మత్తులో తమ్ముడు సొంత అన్న ప్రాణం తీశాడు. ఈ విషాద ఘటన మోత్కూరు గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పసుపుల వెంకటసుబ్బయ్యకు మల్లికార్జున (40), శ్రీనివాసులు ఇద్దరు కుమారులు. శనివారం రాత్రి అన్నదమ్ములు మద్యం సేవించి తాగిన మైకంలో మాటకు మాట పెరిగి ఘర్షణకు దిగారు. దీంతో తమ్ముడు శ్రీనివాసులు అక్కడే ఉన్న రోకలిబండతో అన్న మల్లికార్జున తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామన్నారు. మృతునికి రెండో భార్య ఈశ్వరమ్మ, ఒక కూతురు ఉన్నారు. నిందితుడు శ్రీనివాసులును అరెస్టు చేశామన్నారు. తల్లి బాలనాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణు నారాయణ తెలిపారు.

ఖైదీ మృతిపై రేపు బహిరంగ విచారణ

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సబ్ జైల్‌లో రిమాండ్ ఖైదీ మృతిపై ఈనెల 20వ తేదీన నంద్యాల జిల్లా కోర్టు ప్రాంగణంలో బహిరంగ విచారణ నిర్వహిస్తున్నట్లు కోర్టు అధికారులు ఆదివారం తెలిపారు. అనకాపల్లి జిల్లా రోళ్లగంట మండలం ఎం.కొత్తపట్నం గ్రామానికి చెందిన కుర్ర వెంకటరమణను ఎన్‌డీపీఎస్ యాక్టు కింద రిమాండ్ ఖైదీగా నంద్యాల సబ్‌జైల్‌కు తరలించారు. అనారోగ్యానికి గురికాగా కర్నూలు సర్వజన జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత ఏడాది నవంబర్ 13న మృతి చెందాడు. మృతుడి తండ్రి కొండల రావు సరైన కారణాలు తెలుసుకునేందుకు కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించారు. మెజిస్ట్రీరియల్ విచారణ నిమిత్తం నంద్యాల జూనియర్ సివిల్ జడ్జిని విచారణ అధికారిగా నియమించింది. ఈనెల 20వ తేదీన కోర్టు ఆవరణలో బహిరంగ విచారణ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

భక్తులకు తప్పిన ప్రమాదం



రోడ్డు పక్కకు ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రమాదం త్రుటిలో తప్పింది. మూడో సోమవారం దర్శనం కోసం భక్తులు ఆదివారం నుంచి తరలివస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఉరుకుంద నుంచి ఆదోని వెళుతున్న ఆర్టీసీ బస్సు కామవరం గ్రామం శివారుల్లో మరో వాహనానికి సైడ్ ఇవ్వబోయి పక్కకు ఒరిగిపోయింది. రెండు రోజుల నుంచి వర్షాలు పడుతుండడంతో బస్సు టైర్లు భూమిలో ఇరుక్కుపోయాయి. డ్రైవర్ సమయస్ఫూర్తితో ప్రయాణికులందరినీ దింపడంతో ప్రమాదం తప్పింది. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు.


ఉయ్యాలవాడను దత్తత తీసుకుంటా

ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తెలిపారు. ఆదివారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామైక్య సంఘం ప్రాంగణంలో పొదుపు మహిళలు అభినందన సభ నిర్వహించారు. మండల సమాఖ్య గౌరవాధ్యక్షురాలు విజయభారతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గ్రామానికి సమీపంలో ఉన్న బయన్న చెరువును హంద్రీనీవా నీటితో నింపుతామన్నారు. గ్రామ శివారులో స్థాపిస్తున్న సోలార్ పరిశ్రమను రద్దు చేయాలని గ్రామ రైతులు ఎంపీని కోరారు.



నైపుణ్యం.. 'మధు'రం

ఎంత దూరం నుంచి వచ్చిందో ఓ తేనె టీగ.. పూల వద్ద సందడి చేస్తూ కనిపించింది. అటూ ఇటూ తిరిగి చాకచక్యంగా పూవులోకి దూరింది. బొట్టు బొట్టుగా మధువును సేకరించి వెళ్లిపోయింది. ఈ దృశ్యాలు కర్నూలు నగరం సీక్యాంప్ సెంటర్‌లోని ఓ ఇంటి వద్ద కనిపించాయి.
–సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



జ్ఞాపకం.. పదిలం

ఒక్క ఫొటో ఎన్నో భావాలను పలికిస్తుంది. మధుర ఘట్టాలను గుర్తు చేస్తుంది. సంతోషం.. బాధ.. సాధించిన విజయాలు.. అద్భుత సన్నివేశాలు.. అంశం ఏదైనా.. పదిలంగా దాచుకొని మళ్లీమళ్లీ చూసుకునే అవకాశం ఫొటోతోనే సాధ్యం. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అపురూప చిత్రాలు ఇవీ..
–సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



శ్రావణమాసం.. కర్నూలు కేసీ కెనాల్ వద్ద పౌర్ణమి చంద్రుడు



జాలీగా.. ఈతకొట్టేందుకు కాలువలో దూకుతున్న చిన్నారులు



జీవన సౌందర్యం.. పొలంలో పనిచేస్తున్న రైతులు, కూలీలు

పేదోడిపై టీడీపీ నేతల దౌర్జన్యం

- మొబైల్ క్యాంటీన్ నిర్వాహకుడిపై దాడి

మంత్రాలయం: మొబైల్ క్యాంటీన్ నడిస్తేనే ఆ కుటుంబానికి బతుకు. కొన్నేళ్లుగా ఇదే జీవనాధారం. అదేదో కొత్తగా పెట్టుకున్న మొబైల్ క్యాంటీన్ అంతకన్నా కాదు. అలాంటి పేదోడిపై టీడీపీ నేతలు దౌర్జన్యం చేశారు. అవమానకర రీతిలో నిర్వాహకుడిపై చెయ్యి చేసుకుని నానా యాగీ చేశారు. టీడీపీ నేతల తీరును చూసి గ్రామస్తులు సైతం విస్తుపోయారు. వివరాలివి.. మంత్రాలయం మండలం కల్లుదేవకుంట గ్రామానికి చెందిన మల్లప్ప కుటుంబం గతంలో పంచాయతీ స్థలంలో కొట్టం వేసుకుని హోటల్ నడుపుకుంటూ జీవనం సాగించేది. కొత్తగా పంచాయతీ భవనం నిర్మించాలని ప్రభుత్వం మల్లప్ప కొట్టాన్ని, బంకును తొలగించింది. జీవనాధారం దూరం కావడంతో మొబైల్ క్యాంటీన్ ఆలోచన చేశాడు. పంచాయతీ స్థలంలో చివరన ఉదయం క్యాంటీన్ బండి ఉంచుకుని అల్పాహారం చేస్తూ వచ్చాడు. రాత్రి బండిని ఇంటికి తీసుకుని వెళ్లి మళ్లీ ఉదయం అక్కడ ఉంచుకుని బతుకు సాగిస్తున్నాడు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మల్లప్ప క్యాంటీన్‌పై గ్రామ టీడీపీ నాయకుల కన్ను పడింది. ఎలాగైనా తొలగించాలని నెలలుగా సతాయిస్తూ వచ్చారు. పై నాయకుల నుంచి పలుమార్లు ఒత్తిళ్లు సైతం తెచ్చారు. అయితే మల్లప్ప తనకు రాజకీయం వద్దని, క్యాంటీన్ నడుపుకుని బతుతానని నాయకులకు చెబుతూ వచ్చాడు. ఎంతకీ మల్లప్ప మాట వినడని భావించిన తమ్ముళ్లు పన్నాగం పన్నారు. మొబైల్ క్యాంటీన్ ఉంచుకునే స్థలంలో శనివారం రాత్రి టీడీపీ నాయకులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. రోజూ మాదిరే మల్లప్ప బండి తెచ్చుకుని పనిలో నిమగ్నమయ్యాడు. గాలికి కూలిందో.. లేక యాదృచ్ఛికంగా పడిపోయిందో.. తెలియదుగానీ ఇదే అదునుగా చూసుకుని మల్లప్పతో గొడవకు దిగారు. ఓ నాయకుడు ఏకంగా చెప్పు విసిరి అవమానకరంగా ప్రవర్తించాడు. గ్రామస్తులు అడ్డు పడినా టీడీపీ నేతలు మాత్రం వినిపించుకోలేదు. అవమానం జరగడంతో బాధితుడు స్టేషన్‌ను ఆశ్రయించాడు. తాను ఫ్లెక్సీని కూల్చలేదని అనవసరంగా నెపాన్ని తనపై నెట్టుతున్నాడని మొరపెట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు సైతం స్టేషన్‌కు వెళ్లారు. తమ ఫ్లెక్సీని మల్లప్ప కూల్చివేశాడని చెప్పుకొన్నారు. విషయంపై ఎస్ఐ గోపీనాథ్ విచారణ చేపట్టారు.



క్యాంటీన్ నిర్వాహకుడితో వాగ్వాదానికి దిగిన టీడీపీ నాయకులు

ఆదోనిలో కన్నడ మహామేళా

- ఈనెల 24, 25వ తేదీల్లో నిర్వహణ

ఆదోని అర్బన్: పట్టణంలో రెడ్డిభవన్‌లో ఈనెల 24, 25వ తేదీల్లో కన్నడ మహామేళా నిర్వహిస్తున్నట్లు అఖిల భారత కర్ణాటక విద్యావర్ధక సంఘం ప్రధాన కార్యదర్శి శంకర్ అలగత్తి, సంఘం సభ్యులు కృష్ణమూర్తి తెలిపారు. పట్టణంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఆదివారం వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదోని డివిజన్ పరిధిలో కన్నడ భాష ఎక్కువగా మాట్లాడే వారు ఉన్నారన్నారు. కన్నడిగులు ఎక్కువ ఉండే ప్రాంతాల్లో కన్నడ మహామేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు కసప్పనార్, సుగూరప్ప, మరులరాధ్య మల్లికార్జున, వెంకటేష సిద్ధన్నగౌడ, రాము, లక్ష్మీదేవమ్మ, హెచ్ఎం వీరశ్రీ కళ్యాణి, అన్నపూర్ణ, మహేష్, శివకుమార్‌గౌడ్, భీరప్ప తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

యువకుడిపై రౌడీషీటర్ హత్యాయత్నం


బొమ్మలసత్రం: నంద్యాల పట్టణానికి చెందిన కరిముల్లా అనే యువకుడిపై రౌడీషీటర్ కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉప్పరిపేట వీధిలో నివసిస్తున్న మున్ని కుమారుడు కరిముల్లా పాలిష్ బండల కటింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొద్ది రోజుల క్రితం జమాత్‌కు వెళ్లిన కరిముల్లా శనివారం పట్టణానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ సల్మాన్ అలియాస్ చికిలి మరో యువకుడితో కలిసి కరిముల్లాకు ఫోన్ చేసి ఇంటి నుంచి బయటకు రప్పించారు. అప్పటికే మటన్ నరికే కత్తులతో సిద్ధంగా ఉన్న వారు కరిముల్లా తలపై విచక్షణా రహితంగా దాడి చేశారు. కరిముల్లా గట్టిగా కేకలు వేయటంతో స్థానికులు వచ్చేసరికి నిందితులు పరారయ్యారు. రక్తపుమడుగులో పడి ఉన్న కరిముల్లాను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కరిముల్లా

ఒక కొమ్మ పువ్వులు.. ఒక గూటి దివ్వెలు

- ప్రేమానురాగాలకు ప్రతీక రక్షాబంధన్
- అన్నా చెల్లులు, అక్కాతమ్ముళ్లు జరుపుకునే ప్రత్యేక పండుగ
- నేడు రాఖీ పౌర్ణమి



కర్నూలు కల్చరల్: సోదరీ సోదరుల అనురాగం, ఆప్యాయత, అనుబంధాల ప్రతీక రక్షాబంధన్. పేగుతో పంచుకున్న అనుబంధాన్ని దారంతో ముడి వేసి తోబుట్టువుగా గుర్తుచేసే చిన్న దారానికే వెన్నెలా కరిగిపోయే అన్నదమ్ముల ఆప్యాయతను కలబోసుకున్న అపురూపమైన పండుగ రాఖీ పౌర్ణమి. శ్రావణ మాసం వచ్చిందంటే చాలు సోదర సోదరీమణుల మధ్య ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తాయి. వీరి అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది రక్షాబంధన్. కుటుంబంలో అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధం చాలా గొప్పది. పండు వెన్నెల చల్లదనంలా పదికాలాల పాటు నిలుస్తుంది. ఈ బంధంలో ఆనందమే కాకుండా కుటుంబ కీర్తి వంశ మర్యాదలు దాగి ఉంటాయి. సామాజిక క్షేమాభిలాష ఉంటుంది. పరస్పర స్నేహంతో సాగే సంస్కార సంపన్నత ఉంటుంది. సహృదయాల భావనలు ఉంటాయి. ఇవన్నీ కలిసి పోగులుగా కూర్చుకొని దీక్షగా కట్టుకునేదే రాఖీ పండుగ. సోమవారం రాఖీ పౌర్ణమి ఉండటంతో ఇప్పటికే జిల్లా వ్యాపంగా గ్రామాల్లో పట్టణాల్లో సందడి నెలకొంది. మార్కెట్‌లో వివిధ రకాల రాఖీలతో విక్రయాలు ఊపందుకున్నాయి. 'రక్షా బంధన్'నే రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాల్లో శ్రావణ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు. అన్నాచెల్లెళ్లు అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా రక్షా బంధన్‌ను జరుపుకుంటారు. కొంత కాలం క్రితం వరకూ ఉత్తర, పశ్చిమ భారతదేశాలలో ఈ పండుగను చాలా వైభవంగా జరుపుకునేవారు. ఇప్పుడు దేశమంతా జరుపుకుంటున్నారు. అన్నకుగాని తమ్మునికి కానీ ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ జీవితాంతం ఒకరికొకరు రక్షగా ఉండాలనే సందేశాన్ని ఇస్తుంది ఈ పండుగ. సోదరి తన తోబుట్టువులు మహోన్నత శిఖరాలకు ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటుంది.

సోదర ప్రేమకు చిహ్నం



కుటుంబంలో అన్నాతమ్ముళ్లు, అక్కా చెల్లెళ్ల అత్యంత ప్రేమ అనురాగాలతో ఉన్నప్పుడే ఒక రక్షణ ఒక బాధ్యత ఉంటుంది. వాటి వల్లనే కుటుంబం వర్ధిల్లుతోంది. కుటుంబంలో ప్రేమలు బలపడటానికి పరస్పర సహకారానికి, ఆదర్శాని కి, ఆప్యాయతకు నిదర్శనాలు. మన అనుబంధాలు భద్రపరచుకోడానికి ఉత్సాహంగా ఇలా పండుగను జరుపుకుంటాం. సోదర ప్రేమ బంధంలో కుటుంబ గౌరవం, పటిష్టత నెలకొని ఉంటాయి.
– డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి, తెలుగు ఉపన్యాసకురాలు, కేవీఆర్ డిగ్రీ కళాశాల

దేశానికి రక్షగా నిలవాలి



రక్షా బంధన్ వేడుకను పూర్వకాలం నుంచి జరుపుకుంటూనే ఉన్నాం. పురాణ ఇతిహాసాలతో పాటు చారిత్రక గ్రంథాల్లో కూడా రాఖీ పౌర్ణమి గురించి ఉంది. సుభద్రాదేవి, ద్రౌపది ఇరువురు వారి సోదరునికి రక్షా బంధన్ కట్టి రక్షణ కోరుకున్నారు. పురుషోత్తముడి సతీమణి అలెగ్జాండర్‌కు సోదర ప్రేమతో రాఖీ కట్టారు. నీకు నేను.. నాకు నువ్వు ర క్షణగా ఉండాలి.. మన మందరం కలిసి దేశానికి రక్షగా నిలవాలి. ఆత్మీయంగా అందరూ కలిసి ఉండటమే భారతీయ సంస్కృతి.
– స్వామిని సుప్రేమానంద, చిన్మయమిషన్ జిల్లా బాధ్యులు

రక్షాబంధనం.. దీక్షా కంకణం



మురిపాల చెల్లెమ్మ ప్రేమకు ప్రతిరూపం, ఆత్మీయ అక్కయ్య ఆశీర్వచనా సౌరభం, అన్నా తమ్ముళ్లు చూపే అభిమాన వాత్సల్యాలకు ఆజన్మాంత సంరక్షణ బాధ్యత స్వీకరణకు నిలువెత్తు దర్పణం, సంప్రదాయ విలువల ప్రతీక రక్షాబంధనం. స్త్రీ మూర్తిని సోదరిగా భావింపచేసే మనోజ్ఞ పర్వం. 'యత్ర నార్యస్తు పూజ్యతే' భావానికి ఉదాహరణం రక్షాబంధనం. కలుషితం అయిపోతున్న సమాజానికి త్రికరణ శుద్ధిగా సుహృద్భావాన్ని పెంపొందించి అనుబంధాలకు ఊతమిచ్చే రక్షా బంధనమే దీక్షా కంకణం కావాలి. – డాక్టర్ తొగట సురేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు, డోన్

ప్రకృతి రక్షా బంధన్

మనిషి స్వార్థానికి పర్యావరణం దెబ్బతిని మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. పీల్చే గాలి.. తాగే నీరు.. తినే ఆహారం సర్వం కలుషితమై ఆయుష్షు ప్రమాణం తగ్గిపోతుంది. ఈ క్రమంలో పర్యావరణానికి రక్ష కట్టి కాపాడాలంటూ ప్రకృతి చెబుతోంది. మండల కేంద్రం సి.బెళగల్ నుంచి క్రిష్టదొడ్డి గ్రామంకు వెళ్లే దారిలో తీగజాతి మొక్కకు పుష్పించిన రాఖీ పూలను చూస్తే అవుననిపిస్తోంది. – సి.బెళగల్





కనువిందు చేస్తున్న రాఖీ పూలు

పేకాట స్థావరంపై దాడి

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల పేకాట స్థావరంపై ఆదివారం దాడి చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించగా 10 మంది పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి రూ.11,610 నగదు, 3 బైక్‌లు, 4సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

ఐదు టిప్పర్ల పట్టివేత

కర్నూలు (టౌన్): కర్నూలు సఫా ఇంజినీరింగ్ సమీపంలోని రింగ్ రోడ్డు వద్ద అనుమతులు లేకుండా మెటల్ తరలిస్తున్న ఐదు టిప్పర్లను ఆదివారం గనుల శాఖ అధికారులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా గ్రావెల్, రోడ్ మెటల్ తరలిస్తుండటంతో రూ.60 వేలు జరిమానా విధించినట్లు జిల్లా గనులు, భూగర్భశాఖ సంచాలకులు రాజశేఖర్ తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

బంజారాల తీజ్ ఉత్సవాలు ప్రారంభం

కర్నూలు(అర్బన్): బంజారాల సంస్కృతిలో భాగమైన తీజ్ ఉత్సవాల మొదటి దశ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక సత్యనారాయణ స్వామి దేవాలయంలో ప్రారంభించారు. ఉత్సవ కమిటీ సభ్యులు రంగనాయక్, నాగరాజునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కైలాస్‌నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పండుగ ప్రతి ఏడాది శ్రావణమాసంలో తొమ్మిది రోజుల పాటు జరుగుతుందన్నారు. మొదటి రోజున వివాహం కాని అమ్మాయిలతో నవధాన్యాల విత్తనాలను బుట్టల్లో వేసి తొమ్మిది రోజుల పాటు వాటికి ప్రతి రోజు నీళ్లు పోయడం వల్ల వచ్చే మంచి మొలకల వల్ల గిరిజన బంజారాలకు మేలు జరుగుతుందనే విశ్వాసం ఉందన్నారు. అలాగే వివాహం కాని అమ్మాయిలకు మంచి వరుడు వస్తాడనే నమ్మకం ఉందన్నారు. ఈ పండుగను దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలందరు ఎంతో భక్తితో నిర్వహిస్తారన్నారు. మొలకెత్తిన విత్తన బుట్టలను ఈ నెల 26న మధ్యాహ్నం 12 గంటలకు కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేస్తారన్నారు. కార్యక్రమంలో జగన్‌నాయక్, బద్దునాయక్, రామునాయక్, ఆంజనేయులు నాయక్, లక్ష్మణ్‌నాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



తీజ్ పండుగ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బంజారా నేతలు

ఉక్కపోత.. విద్యుత్ కోత

కొత్తపల్లి: పగలంతా ఎండల తీవ్రత పెరిగి ఉక్కపోతతో అవస్థలు పడిన జనం రాత్రి విద్యుత్ కోతతో జాగారణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి విద్యుత్ కోతతో విలవిలలాడారు. గోకవరం, కొత్తపల్లి, వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాల్లో అర్ధరాత్రి 12.30 నుంచి 2.30 గంటల వరకు, ఆదివారం తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు విద్యుత్ లేకపోవడంతో ఇళ్లలో ఉండలేక ఆరుబయట జాగారం చేశారు. విద్యుత్ కోతలపై స్థానిక అధికారులను సంప్రదించగా తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా జెడ్పీ పరిపాలనాధికారి సీ మురళీమోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కోవెలకుంట్ల సమీపంలోని నయనాలప్ప దేవస్థానంలో జిల్లా నూతన కార్యవర్గం, స్టేట్ కౌన్సిల్‌కు ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ తాలూకా యూనిట్లు, జెడ్పీ యూనిట్ కలిపి మొత్తం 60 మంది ఓటర్లు ఉండగా, 50 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా సీ మురళీమోహన్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా కేవీ రామబ్రహ్మం, ఉపాధ్యక్షులుగా ఎల్‌టీ చంద్రమౌళీ, పీ ఆంజనేయులు, బీ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కే రామక్రిష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎస్ సలీంబాషా ఎన్నికయ్యారు. అలాగే ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జీ రవీంద్రనాథ్‌రెడ్డి, కే శ్రీనివాసులు, ఎం శ్రీనివాసనాయుడు, కోశాధికారిగా జీవీ క్రిష్ణారెడ్డి విజయం సాధించారు. స్టేట్ కౌన్సిల్‌కు పీ దస్తగిరిబాబు, పీ గోపాల్, ఎం రాజానందం, ఎస్ వెంకటరమణ, జేసీసీ మెంబర్‌గా ఎస్ సంజీవరాయుడు ఎన్నికయ్యారు. కర్నూలు మండలం పసుపుల గ్రామ పంచాయతీ కార్యదర్శి హేమంత్‌కుమార్‌రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించి విజేతలకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యవర్గం మూడు సంవత్సరాల పాటు పనిచేయనుంది.



ఎన్నికైన పీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గం

ఆసుపత్రికి తాళం.. అందని వైద్యం



మొలగవల్లి పీహెచ్‌సీ ముందు ఆందోళనకు దిగిన గ్రామస్తులు

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆలూరుకు తరలింపు
- ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టిన గ్రామస్తులు

ఆలూరు రూరల్: కర్నూలు జిల్లా ఆలూరు మండలంలోని మొలగవల్లి పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది ఆదివారం విధులకు డుమ్మా కొట్టారు. 24 గంటలు పనిచేయాల్సి సిబ్బంది ఉదయం నుంచి ఆస్పత్రికి వేసిన తాళం తెరవలేదు. మొలగవల్లి పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది నిర్లక్ష్యంతో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాబు అనే వ్యక్తి ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాల నుంచి బయటపడ్డాడు. ఈ నేపథ్యంలో మొలగవల్లి గ్రామస్తులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. ఆస్పత్రిలో విధులకు హాజరుకాని వైద్యారోగ్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఆస్పత్రి సిబ్బంది విధులకు హాజరుకావడం లేదని ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందించడం లేదని గ్రామస్తులు వాపోయారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రి వద్ద నిరీక్షిస్తున్న క్షతగాత్రుడు దారండి బాబు

24 గంటలు వైద్యసేవలు


గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కింద 2022 ఏడాది రూ.1.70 కోట్లతో మొలగవల్లి గ్రామంలో నూతన పీహెచ్‌సీని నిర్మించింది. ఇందులో ముగ్గురు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులతో పాటు ఒక ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, కుట్లు వేయడం, గాయాలకు డ్రస్సింగ్ చేయడానికి ఇద్దరితో పాటు వాచ్‌మెన్ పనిచేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోగులకు సేవలందించిన పీహెచ్‌సీ సెంటర్లపై టీడీపీ అధికారం చేపట్టిన తర్వాత పర్యవేక్షణ కరువైంది.

ఆస్పత్రిలో సిబ్బంది ఉండడం లేదు



మొలగవల్లి పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. వైద్యారోగ్య సిబ్బంది విధులకు హాజరుకావడం లేదు. రాత్రి పూట ఎంతో మంది రోగులు, గర్భిణులు ఆస్పత్రికి వస్తుంటారు. ఇక్కడ సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రాణాలు పోయే పరిస్థితి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి. – భూపేష్, మొలగవల్లి గ్రామం

గతంలో అన్ని సేవలు పొందేవాళ్లం



గత ప్రభుత్వ హయాంలో మా గ్రామంలోని పాత పీహెచ్‌సీ భవనం కూల్చివేసి రూ.1.70 కోట్లతో నూతన పీహెచ్‌సీ భవనం నిర్మించారు. రోజూ ప్రసవాలు జరిగేవి. ఎలాంటి జబ్బు ఉన్నా వైద్యం అందేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. వైద్యులు ఎప్పుడు వస్తారో..ఎప్పుడు వెళ్తారో తెలియదు. చిన్నపిల్లలు, వృద్ధులకు జబ్బు చేస్తే ఆలూరు, గుంతకల్లు ప్రభుత్వాస్పత్రులు లేదా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. మొలగవల్లి పీహెచ్‌సీలో రాత్రి పూట అత్యవసర వైద్య సేవలు అందడం లేదు.
– ఉరుకుంద, మొలగవల్లి గ్రామం